
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | శుక్రవారం 6 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-



# బీఆర్ఎస్ కాదు..
# డీఆర్ఎస్

- "యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మార్చాం
- కొండపై భక్తులు నిద్రించేలా.. ఆటోలు నడిచేలా చేస్తాం
- 60 కిలోల బంగారంతో ఆలయ గోపురం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం.
- మూసీ ప్రక్షాళన చేసి నల్గొండ రైతులను ఆదుకుంటాం
- గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం.
- పదేళ్లు దోచుకొని రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు
- రూ.8లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీశారు.

## తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం
## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**భువనగిరి**

తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజక వర్గంలో రూ.1500 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. "యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మార్చాం. కొండపై భక్తులు నిద్రించేలా.. ఆటోలు నడిచేలా చేస్తాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపురం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. టీటీడీ బోర్డు మాదిరిగా తెలంగాణలోనూ వైటీడీ ఏర్పాటు చేశాం. యాదగిరిగుట్టలోని విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి అభివృద్ధి చేస్తాం. ఎవరు అడ్డం పడినా సరే.. మూసీ ప్రక్షాళన చేసి నల్గొండ రైతులను ఆదుకుంటాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. సబర్మతి, గంగా నదులు ప్రక్షాళన చేసుకోవచ్చు.. మూసీ నదిని మాత్రం ప్రక్షాళన చేయకూడదా? బంగారు తెలంగాణ ముసుగులో పదేళ్లు దోచుకున్న వాళ్లా నన్ను ప్రశ్నించేది. వాసాలమర్రి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఇళ్లన్నీ కూలగొట్టారు. ఆ తర్వాత కేసీఆర్ ఆ గ్రామాన్ని పట్టించుకోలేదు. పదేళ్లు దోచుకొని రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు. రూ.8లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీశారు. - మిగతా3లో

# పేదల పాలిట వరమైన
# ఆర్డీటీ సేవలు ఆగవు..


## కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నాం
## ఏపీ విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి:**

పేదల పాలిట వరమైన ఆర్డీటీ సేవలు ఆగవని, కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నామని ఏపీ విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన అమరావతి లో మీడియాతో మాట్లాడుతూ.. రాయలసీమతో పాటు తెలంగాణ లోని పలు ప్రాంతాల్లో గ్రామీణులకు సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతోనూ, సంబంధిత ఉన్నతాధికారులతోనూ, సంస్థలతోనూ సంప్రదింపులు - మిగతా2లో

# త్వరలో బనకచర్లకు
# టెండర్ల ఆహ్వానం



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

త్వరలో పోలవరం - బనకచర్లకు టెండర్లు ఆహ్వానిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అటవీ - పర్యావరణ అనుమతులు, డీపీఆర్ ఆమోదం తదితర అంశాలన్నీ అనుకున్న సమయానికి జరగాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు సైతం సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. హైబ్రీడ్ యాన్యుటీ విధానంలో పోలవరం - బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టాలని ఉన్నతాధికారు లకు ఆయన వివరించారు. శుక్రవారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడుతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. టెండర్లకు సంబంధించిన రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీతో డ్రాఫ్ట్ డాక్యుమెంట్ రూపొం దించడం, సాంకేతిక నిపుణుల పర్యవేక్షణ అనంతరం టెండర్లు పిలవడం వంటి అంశాలన్నీ జూన్ మాసాంతానికి పూర్తి కావాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. జల హారతి కార్పొరేషన్ కింద పోలవరం - - మిగతా3లో

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు
# 'షైనింగ్ స్టార్' అవార్డులు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్' అవార్డులు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు మండలాల వారీగా ఎంపిక చేసి షైనింగ్ స్టార్ అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ మార్గదర్శకాలు విడుదల చేశారు. విద్యా వ్యవస్థలో నాణ్యత, ప్రమాణాలు పెంచేందుకు ఈ అవార్డులు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది. ఈ నెల 9న అన్ని జిల్లా - మిగతా3లో

# పర్వతనేని కోటేశ్వరరావు మృతిపట్ల ప్రగాఢ సంతాపం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ.



**అంకుశం న్యూస్ విజయవాడ జూన్ 6**

ప్రముఖ పారిశ్రామిక వేత్త, నవత ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థాపకులు శ్రీ పర్వతనేని కోటేశ్వరరావు గారి మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీ పర్వతనేని కోటేశ్వరరావు 1982లో మొట్టమొదటిసారిగా రవాణా సేవలకు శ్రీకారం చుట్టి, అనతి కాలంలోనే 9 రాష్ట్రాలకు సంస్థ కార్యకలాపాలను విస్తరించారు. నవత ట్రాన్స్పోర్ట్ ద్వారా వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు, దేశంలోనే అత్యుత్తమమైన రవాణా సేవలను అందించారు. ఆయన మృతి రవాణా రంగానికి తీరని లోటు. శ్రీ పర్వతనేని కోటేశ్వరరావు మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం

# మోహినీ అవతారంలో శ్రీ గోవిందరాజస్వామి

**అంకుశం న్యూస్ తిరుపతి జూన్ 6**



తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజైన శుక్రవారం ఉదయం గోవిందరాజస్వామివారు పల్లకీపై మోహినీ అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, కేరళ కళాకారుల డ్రమ్స్, మంగళవాయిద్యాల నడుమ పల్లకీ ఉత్సవం సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. మోహినీ అవతార వృత్తాంతం భాగవతంలో రమణీయంగా వర్ణించారు. సురాసురులు అమృతం కోసం క్షీరసాగరాన్ని మథించారు. అందులో హేయమైన విషంతోపాటు ఉపాదేయమైన అమృతం, ఎన్నో మేలి వస్తువులు ఉద్భవించాయి. వివిధ దేవతలు వాటిని స్వీకరించారు. చివరికి వారు కోరుకున్న అమృతం లభించింది. దానిని పంచుకోవడంలో కలహం తప్పలేదు. ఆ కలహాన్ని నివారించి అసురులను వంచించి సురులకు అమృతాన్ని పంచడానికి శ్రీహరి మోహినీ రూపంతో సాక్షాత్కరించాడు. అసురులు సమ్మోహకమైన ఆమె క్రీగంటి చూపులకు పరవశులైపోయారు. తత్ఫలితంగా వారు వంచింపబడడం, దేవతలు అనుగ్రహింపబడడం జరిగింది. అనంతరం ఉదయం 10 నుండి 11.00 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్ళతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్.శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, పలువురు ఆలయ అధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# త్వరలో బనకచర్లకు టెండర్ల ఆహ్వానం

-మొదటిపేజీ తరువాయి

బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణం చేపడుతుండగా.. దీని కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీపీ) ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు.ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో ఆర్థిక వనరుల సమీకరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే ఏపీ ప్రతిపాదనలు పంపించిందన్నారు. మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.81,900 కోట్ల వ్యయం అవుతుందన్నారు. అందులో 50 శాతం అంటే రూ.40,950 ఈఏపీ రుణంగా పొందాలని నిర్ణయించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌గా 20 శాతం నిధులు రూ.16,380 కోట్లు సమకూర్చుకోవాలని.. రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీగా 10 శాతం నిధులు రూ.8,190 కోట్లు.. హ్యామ్ విధానంలో మరో 20 శాతం నిధులు రూ.16,380 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ ప్రాజెక్ట్ డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి కావాలని ఆయన ఆదేశించారు. కృష్ణా - గోదావరి డెల్టాకు తక్షణమే నీరు విడుదల చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తుపాన్ల ముప్పు తప్పేలా పంట కాలం ముందుకు జరగాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 365 రోజులు భూమి పచ్చగా ఉండేలా.. అందుకోసం 3 పంటలు నిరంతరం పండించేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. బుడమేరులో పూడిక తొలగించాలని.. ఆ క్రమంలో వాగులో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పూడిక తీత, ముళ్ల కంపలు తొలగించాలని సూచించారు. శాస్త్రీయంగా వాటర్ ఆడిటింగ్ - వాటర్ మేనేజ్‌మెంట్ జరగాలన్నారు. పిజియో మీటర్లు, సెన్సర్లు కొనుగోలుకు రూ.30 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. భూగర్భ జలాలు పెంచడం, రిజర్వాయర్లు నింపడం, జల వనరుల సమర్థ వినియోగం జరిగేలా చూడాలన్నారు. ప్రధానంగా ఈ 3 అంశాలపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. భూగర్భ జలాల వివరాలతో బులిటెన్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. సీలేరు నీటిని కృష్ణా డెల్టాకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఇక హంద్రీ - నీవా మెయిన్ కెనాల్ వైడనింగ్ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. వెలిగొండ స్టేజ్ వన్ పనులు 2026 జూన్ నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ఆర్థిక సాయం కోసం సాస్కిలో పెట్టండన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఒక్క ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినా.. ఆ నీటితో మూడునాలుగేళ్లు కరువొచ్చినా వాటర్ మేనేజ్‌మెంట్ జరగాలని ఆయన ఆకాంక్షించారు. క్రాప్ ప్యాట్రన్ మార్చి.. తడి- ఆరుతడి పంటల సాగుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. జల సంరక్షణ కోసం వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించాలని అధికారులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేశారు.



# ఏడాదిలో పూలెన్ని... రాళ్లెన్ని..

**విజయవాడ :** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సరిగ్గా ఏడాది అయింది న కనీ వినీ ఎరుగని మెజారిటీతో కూటమి అధికారం లోకి వచ్చింది.మొదటినుంచి చంద్రబాబు తీరు తెలిసిన వాళ్ళకి ఈసారి ఆయనలో ఒక డిఫరెంట్ బాడీ లాంగ్వేజ్ కనిపిస్తుంది. ఆయన తన మొఖంలోని ఫీలింగ్స్ కనిపించకుండా రాజకీయాల్లో చాలా జాగ్రత్తగా ఉండేవారు. కానీ ఈసారి ఆయన వీలైనంత ఎక్కువగా నవ్వుతున్నారు. ఏమాత్రం అవకాశం దొరికినా సామాన్యులతో కలిసి పోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది ప్రధానంగా ఆయనలో కనిపిస్తున్న మార్పు. తను బయటికి వస్తుంటే వీలైనంత తక్కువగా ఆర్భాటం ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. ప్రజలకు ట్రాఫిక్ పరంగా ఇబ్బందులు తనవల్ల కలగకూడదనే తాపత్రయం అడుగడుగునా కనిపిస్తుంది. అందుకే ఈసారి మహానాడు కూడా కడప నగరంలో జరిపినా వేదికను ట్రాఫిక్ కి ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా ఊరికి 7 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. ఈ విషయంలో చంద్రబాబుకి ప్రజల నుంచి మంచి మార్కులు పడుతున్నాయి.టిడిపి రాజకీయ మొత్తం ప్రస్తుతం లోకేష్ చుట్టూనే నడుస్తుంది. ప్రభుత్వ పరంగానూ చిన్న బాస్ మాటే శిరధార్యం గా మారింది. అటు పార్టీ పైనా ఇటు పవర్ లోనూ లోకేష్ మరియు ఆయన టీం పూర్తిస్థాయిలో పట్టు బిగించింది. చంద్రబాబు సైతం భవిష్యత్తు నాయకుడిగా లోకేష్ ను ప్రమోట్ చేస్తున్నారు. ఢిల్లీలోని బిజెపి నాయకత్వం దాన్ని గుర్తించింది. లోకేష్ మంగళగిరిలో జరుపుతున్న ప్రజా దర్బార్ సక్సెస్ సాధించటంతో ఆయన జిల్లాల పర్యటనలోనూ దాని కంటిన్యూ చేస్తున్నారు. 2014 -19 మధ్య లోకేష్ ను ప్రధానంగా పారిశ్రామిక వర్గాలే కలుస్తూ ఉండేవి. ఈసారి సామాన్య ప్రజల్ని కలవడానికి ఆయన ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రత్యర్థులు కూడా చంద్రబాబు కంటే ఎక్కువగా లోకేష్ ను టార్గెట్ చేస్తున్నారంటే లోకేష్ పవర్ సెంటర్ గా ఏ స్థాయిలో ఉన్నారో అర్థమవుతుంది. అలాగే స్టూడెంట్స్ తో వీలైనంత ఎక్కువగా ఆయన మమేకం అవడానికి చూస్తున్నారు. విద్యా వ్యవస్థలో వీలైనంత మార్పులు తేవడానికి ఆయన గట్టిగానే ప్రయత్నిస్తున్నారు.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా తన ప్రాధాన్యత చూపిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అభివృద్ధి చేయడం వంటివి, అటవీ శాఖలో కుంకీ ఏనుగుల ను ప్రత్యేకంగా రప్పించడం వంటి కార్యక్రమాలతో మంచి పేరే తెచ్చుకుంటున్నారు. అయితే పొలిటికల్ గా మాత్రం ఆయన ఈ ఏడాదిలో తన స్టాండ్ మార్చుకున్నారు. పూర్తిస్థాయిలో సనాతన ధర్మం ఏజెండా గా కష్టపడుతున్నారు. ముఖ్యంగా తమిళనాడు రాజకీయాల్లోనూ తన ప్రభావం చూపించడానికి కొన్ని ప్రయత్నాలు చేశారు. మరో 15 ఏళ్లు కూటములోనే కొనసాగుతామని ఆయన స్పష్టత ఇచ్చేయడంతో ఆయన ఓకే అంటే జనసేనలో చేరడానికి చాలామంది రెడీగా ఉన్నారు. కానీ విషయంలో జనసేన ఆచితూచి వ్యవహరిస్తుంది. కేంద్రంలో కూటమి కీలకం గా మారడంతో అమరావతికి తగినన్ని ఫండ్స్ బానే తెచ్చుకుంటున్నారు. గత ఐదేళ్లు పాడుబడిన అడవిలా మారిన అమరావతి కి కొత్త కళ వచ్చింది. అమరావతి పనులను ఏజెన్సీలకు టెండర్లు ఇచ్చేంతవరకకూ ఏడాదిలో పనులు జరిగాయి. జరగాల్సింది చాలానే ఉంది.ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఐదేళ్లలో పోలవరం పూర్తి చేయాలని కష్టపడుతుంది కూటమి ప్రభుత్వం. ప్రజలు కూడా ఒక విధంగా చెప్పాలంటే కూటమి కి డెడ్లైన్ విధించినట్టే. దాంట్లో ఒక ఏడాది పూర్తయిపోవడంతో ఇంక నాలుగేళ్లు మాత్రమే సమయం మిగిలి ఉంది. పోలవరం పూర్తి చేయడంతో పాటుగా బనక చర్ల తో అనుసంధానం చేయాలని కొత్త ప్రాజెక్ట్ ని చంద్రబాబు అనౌన్స్ చేశారు. అది పూర్తయితే రాయలసీమ కూడా సస్య శ్యామలం అయినట్టే గత వైసిపి ప్రభుత్వం దెబ్బ తినడానికి అతిపెద్ద కారణం రోడ్లు. ఆ పరిస్థితి అర్థం చేసుకున్న కూటమి అధికారం లోకి వచ్చీ రాగానే రోడ్లపై పడ్డారు. ప్రస్తుతం ఏపీలో రోడ్లు ఓ దారి కయితే వచ్చాయి. ఈ ఒక్క యాడదలోనే ఏపీకి 9 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను తెచ్చే ప్రయత్నం చేసామన్నారు కూటమి మంత్రి టీజీ భరత్. అలాగే అమరావతిలో క్వాంటం వ్యాలి ప్రాజక్ట్ ను భవిష్యత్తు గేమ్ చేంజర్ గా చెబుతున్నారు సీయం చంద్రబాబు. అలాగే అమరావతి వైజాగ్ మెట్రో లకు సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలను త్వరలోనే అమలులో పెట్టి ప్రయత్నం చేస్తున్నారు. గత ఐదేళ్లు ప్రజలకు లేని స్వేచ్ఛను మేము ఇచ్చాము అంటున్నారు కూటమి నేతలు. స్వయంగా సీఎం చంద్రబాబు సహా ప్రభుత్వంలో ఉన్న నేతలందరూ ఇదే మాట చెబుతూ వస్తారు చెబుతూ వస్తున్నారు. ప్రజలపై వేధింపులు తమ పాలన తో తగ్గించామని క్లెయిమ్ చేసుకుంటున్నారు. ఓమేర గ్రామీణ ప్రజల్లో కూడా ఈ భావం ఉంది.ఇక ఈ ఏడాది పాదంలో కుటుంబ ప్రభుత్వం పై వెలుపడుతున్న విమర్శలు కూడా చాలానే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో అభివృద్ధి కంటే తమను హింసించిన వైసీపీ నేతలు పైనే రివెంజ్ తీసుకునే పనిలో పడ్డారని విమర్శలు ప్రతిపక్ష పార్టీల నుంచి వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రెడ్ బుక్కు రాజ్యాంగం అంటూ వారు చేస్తున్న ప్రచారం కొంతమేర ప్రభావం చూపుతోంది. అయితే ప్రజలు దీనిపై అంత పెద్దగా ఆసక్తి చూపడం లేదు. వారి దృష్టి అంతా డెవలప్మెంట్ మీదే ఉంది. వాలంటీర్లు వ్యవస్థను తొలగించిన తర్వాత దాన్ని డీల్ చేసిన విధానం సరిగా లేదనే. అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఎన్నికల సమయంలో వాలంటీర్ల విధానాన్ని కొనసాగిస్తామని చెప్పినా పవర్ లోకి వచ్చాక మాత్రం మంగళం పాడేసారు.తిరుపతిలో ఆవు నెయ్యి కల్తీ జరిగినట్టు కూటమి చేసిన ప్రహసనం పెద్దగా వర్కౌట్ కాలేదు. మరోవైపు రాజకీయంగా ఎలాంటి అవకాశం వచ్చినా దాన్ని బిజెపి తీసుకుపోవడం టిడిపి నేతలకు పార్టీ పరంగా అసహనం కలిగిస్తుంది. అలాగని ఏపీకి బిజెపి నుంచి ఇబ్బడి ముబ్బడి గా సహాయమూ లభించడం లేదన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. అలాగే కరెంటు బిల్లులు పెరిగిపోవడం ఆ నెపానన్ని గత వైసిపి పై వేయడం కూటమికి ఇబ్బంది కలిగించే అంశమే. అలాగే గంజాయి నేరాలు కూటమి పాలన లో కూడా తగ్గలేదనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. సూపర్ సిక్స్ అమలులో జరుగుతున్న జాప్యం కూడా కూటమి నేతలను ఇబ్బంది పాలు చేస్తోంది. ముఖ్యంగా తల్లికి వందనం, మహిళలకు ఫ్రీ బస్సు పథకాల అమలు కోసం జనం ఎదురుచూస్తున్నారు. ప్రతిపక్ష వైసిపి చేస్తున్న అతిపెద్ద తప్పు అసెంబ్లీకి వెళ్లకపోవడం అనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. మొత్తం రాష్ట్ర ప్రజల దృష్టిలో ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశాన్ని చేజేతులా వదులుకుంటుంది వైసిపి చాలామంది భావిస్తున్నారు. అలాగే ప్రభుత్వ విధానాల లోని తప్పిదాలను సమర్థవంతంగా తిప్పుకొట్టడంలో ఎక్కడో లోపం జరుగుతుంది అని విపక్ష పార్టీ కార్యకర్తలే అభిప్రాయపడుతున్న పరిస్థితి ఉంది. ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి ఎక్కువగానే బెంగళూరులో ఉంటున్నారు అన్న ప్రచారాన్ని కూటమి ప్రజల్లో బాగా ప్రచారం చేసింది. ఆయన అందుబాటులో ఉండరనే అభిప్రాయమే ఎక్కువ మందిలో ఉంది. నిజానికి రాజకీయాల్లో ఈ పరిస్థితి రివర్స్ ఉండాలి. ఇలా ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న కొన్ని తప్పిదాలు కూటమికి కలసివస్తున్నాయి.

# జగన్ కు జైలు తప్పదా

**విజయవాడ :** ఏపీలో విచిత్ర రాజకీయాలు నడుస్తున్నాయి. గతంలో తమిళనాడు మాదిరిగా ప్రతీకార రాజకీయాలకు చిరునామాగా ఏపీ మారుతోంది. తమిళనాడులో స్టాలిన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కొంత పరిస్థితి మారింది. అక్కడ ప్రభుత్వం మారిన ప్రతిసారి రాజకీయ ప్రత్యర్థులను వేధించడం పరిపాటిగా ఉండేది. దానికి బ్రేక్ వేశారు సీఎం స్టాలిన్. అయితే దురదృష్టవశాత్తు ఏపీలో మాత్రం ఆ పరిస్థితి ఎక్కువవుతోంది. అక్రమాస్తుల కేసుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. నెలలపాటు జైల్లో ఉండి పోయారు. అయితే తన అరెస్ట్ కు చంద్రబాబు కారణమని భావించిన జగన్మోహన్ రెడ్డి.. అదే చంద్రబాబును అక్రమాస్తుల కేసుల్లో అరెస్టు చేయించారు. 52 రోజులపాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంచగలిగారు. అయితే మొన్నటి ఎన్నికల్లో అదే ప్రభావం చూపించింది. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో జగన్మోహన్ రెడ్డిని అరెస్టు చేయాలన్న డిమాండ్ అధికార పార్టీ నుంచి వినిపిస్తోంది.ప్రస్తుతం రాష్ట్రంలో మద్యం కుంభకోణం తో పాటు ఇతర కేసుల్లో వైసీపీ నేతలు అరెస్ట్ అయ్యారు. కొందరు బెయిల్ పై బయటకు కూడా వచ్చారు. అయితే మద్యం కుంభకోణంలో తదుపరి అరెస్ట్ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి దేనని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఈ కేసుల్లో కీలక నేతలు, అప్పటి సీఎం ఓ అధికారులు అరెస్ట్ అయ్యారు. తదుపరి అరెస్టు జగన్మోహన్ రెడ్డి దేనని ప్రచారం జోరుగా సాగుతోంది. సరిగ్గా ఇటువంటి సమయంలో ఏపీ సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ విషయంలో భిన్న కామెంట్స్ వ్యక్తం చేశారు. జగన్ అరెస్టు వీలు కాదని అర్థం వచ్చేలా మాట్లాడారు.కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న తరుణంలో క్యాబినెట్ భేటీ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పలు అంశాలను చర్చించి ఆమోదం పొందారు. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరుపై చర్చించారు. ఈ క్రమంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ విషయాన్ని ప్రస్తావించారు. జగన్ అరెస్ట్ కోసం అంతా ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే దీనిపై సీఎం చంద్రబాబు ఘాటుగా స్పందించారు. తనను అరెస్టు చేసినందున.. జగన్మోహన్ రెడ్డిని అరెస్టు



చేద్దామంటే ఎలా అని ప్రశ్నించారు. సరైన ఆధారాలు, రుజువులు లేకుండా అరెస్ట్ జరగదని అర్థం వచ్చేలా మాట్లాడారు. నిందితులు, నేరచరితు ల తో రాజకీయంగా పోరాటం చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. మంత్రులు చాలా జాగ్రత్తగా ఉండాలని.. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చంద్రబాబు తేల్చి చెప్పారు. తద్వారా ప్రతీకార రాజకీయాలు లేవని సంకేతాలు ఇచ్చారు.మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అరెస్టు కావాలని సగటు టిడిపి శ్రేణులు కోరుకుంటున్నాయి. ఇదే విషయంపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. చట్టం తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగుతుందని.. ఈ విషయంలో తొందరపాటు వద్దని అర్థం వచ్చేలా చంద్రబాబు మాట్లాడారు. అదే సమయంలో ప్రతీకార రాజకీయాలు ఉండవని సంకేతాలు ఇవ్వగలిగారు. మొత్తానికి అయితే జగన్ అరెస్ట్ ఉండదని అర్థం వచ్చేలా చంద్రబాబు మాట్లాడడం విశేషం. దీనిపై టిడిపి శ్రేణుల్లో భిన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## పేదల పాలిట వరమైన ఆర్డీటీ సేవలు ఆగవు..

-మొదటిపేజీ తరువాయి

జరుపుతున్నామన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో 3,500 గ్రామాల్లో ఆర్డీటీ సేవలు.

విద్య, వైద్య, విజ్ఞాన, ఉపాధి వికాస రంగాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని మంత్రి లోటకేష్ తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలతోపాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాల్లో ఈ సంస్థ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 3,500 గ్రామాల్లో ఆర్డీటీ సేవలు అమలవుతున్నాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలోని బత్తులపల్లి, అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో 600కుపైగా పడకలతో మూడు ఆసుపత్రులను ఆర్డీటీ నిర్వహిస్తోందన్నారు. ఏటా 8.5 లక్షల మంది అవుట్‌పేషెంట్లు, 60 వేలకుపైగా ఇన్‌పేషెంట్లకు సేవలు అందున్నాయన్నారు. కరోనా సమయంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిని కొవిడ్ సెంటర్‌గా మార్చగా.. పది వేల మందికి చికిత్స అందిందని గుర్తు చేశారు. అలాగే మూగ, చెవిటి, మానసిక వికలాంగులైన విద్యార్థులకు అనంతపురంలో మూడు ప్రాథమిక, రెండు ఉన్నత పాఠశాలలను ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు.

## ఇకపై ఏటా డీఎస్సీ

**అమరావతి:** ఏడేళ్ల తర్వాత విజయవంతంగా మెగా డీఎస్సీ చేపట్టామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పకడ్బందీగా పరీక్షలు ప్రారంభించిన యంత్రాంగానికి అభినందనలు చెప్పారు. "రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా అత్యధికంగా 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ. ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగిన అధ్యాయం. ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహణ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసి విద్యాప్రమాణాలను మెరుగుపరుస్తాం. అంతిమంగా రాబోయే నాలుగేళ్లలో ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తేవడమే లక్ష్యం" అని దిశానిర్దేశం చేశారు. పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కూడా ప్రారంభించామన్నారు. మొట్టమొదటి సారిగా నాలుగు వేల మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించామని గుర్తు చేశారు. నూరుశాతం అక్షరాస్యత కోసం ప్రాజెక్ట్ అ-ఆ (అక్షర ఆంధ్ర) ప్రారంభించినట్లు వెల్లడించారు. ఉండవల్లిలోని నివాసంలో పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నత విద్య, వయోజన విద్య, సమగ్రశిక్ష ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్' అవార్డులు: ఏపీ ప్రభుత్వం

-మొదటిపేజీ తరువాయి

కేంద్రాల్లో అవార్డులు ప్రదానం చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పదో తరగతిలో 500 (83.33 శాతం) పైన మార్కులు సాధించిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులను మండలాల వారీగా ఎంపిక చేసి అవార్డులు ఇవ్వనున్నారు. ప్రతి మండలంలో అత్యధిక మార్కులు సాధించిన మొత్తం ఆరుగురు పదో తరగతి విద్యార్థులకు ఈ అవార్డులు ఇస్తారు. వారిలో ఇద్దరు ఓసీ, ఇద్దరు బీసీ, 1 ఎస్సీ, 1 ఎస్టీ విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్‌లో 830, ఆపైన అత్యధిక మార్కులు సాధించిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థులకు జిల్లాల వారీగా ఎంపిక చేసి అవార్డులు ఇవ్వనున్నారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ప్రతి జిల్లాకు 36 మంది చొప్పున ఎంపిక చేసి షైనింగ్ స్టార్ అవార్డులు ఇవ్వనున్నారు. అవార్డుకు ఎంపికైన పది, ఇంటర్ విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్‌తో పాటు రూ. 20వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందించి సన్మానించనున్నారు.

01హరివీరమల్లు పై రాజకీయ నీడ

విజయవాడ, జూన్ 6, (న్యూస్ పల్స్)

చాలా కాలం తరువాత రాబోతున్న పవన్ కల్యాణ్ హరిహర వీరమల్లు గురించి ఫ్యాన్స్, సినీ లవర్స్ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. సినిమా విడుదలకు ముందు టాలీవుడ్‌లో మొదలైన వివాదం చినికి చినికి గాలివానలా మారింది. దీనికి తోడు రాజకీయం సెగలు కక్కుతోంది. మరోవైపు హరిహర వీరమల్లు కోసం నిర్మాత నుంచి తీసుకున్న 11 కోట్ల రూపాయల అడ్వాన్స్‌ను పవన్ వెనక్కి ఇచ్చేశారు.ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేసే క్రమంలో హరిహర వీరమల్లు సినిమాను టార్గెట్ చేస్తున్నారు వైసీపీ నేతలు. కొద్దిరోజుల క్రితం సినీ ఇండస్ట్రీలో చెలరేగిన వివాదాన్ని కూడా పవన్‌పై విమర్శలు చేసేందుకు వాడుకుంటున్నారు. సినిమా వాళ్లను జైల్లో వేస్తామని పవన్ బెదిరిస్తున్నారని.. ఇవి దివాళా రాజకీయాలు కావా అని మాజీమంత్రి పేర్ని నాని విమర్శించారు. పవన్ కళ్యాణ్ తన చెప్పుచేతల్లో ఉన్న మంత్రితో బెదిరింపులకు దిగుతున్నారని.. ఫ్లాప్ సినిమా కోసం ఇంత చేయాలా అంటూ విమర్శించారు.పవన్ కల్యాణ్ తనకు ఓటేసిన ప్రజలను పట్టించుకోకుండా తన సినిమాల గురించి ఆలోచిస్తున్నారని ఆరోపించారు మరో మాజీమంత్రి అంబటి రాంబాబు. హరిహరవీర మల్లు సినిమా ఐదేళ్లకు పైగా తీశారని.. అది నిర్మాతకు కనకవర్షం కురిపించాలంటూ సెటైర్లు వేశారు.మరోవైపు హరిహర వీరమల్లు చిత్రం ప్రీరిలీజ్ వేడుక వాయిదాపడింది. ఈ నెల 8న తిరుపతి ఎస్వీయూ గ్రౌండ్‌లో ఈ కార్యక్రమం జరగాల్సి ఉండగా అనివార్య కారణాలతో ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నామని సినిమా యూనిట్ ప్రకటించిందిఇదిలా ఉంటే హరిహర వీరమల్లు కోసం తీసుకున్న పారితోషికాన్ని తిరిగి ఇచ్చేస్తున్నట్లు పవన్ ప్రకటించారు. 2020లో అధికారికంగా ఈ సినిమా మొదలు కాగా, సుదీర్ఘ కాలం సెట్స్‌పైనే ఉండిపోయింది. పవన్‌కల్యాణ్ రాజకీయంగా బిజీ కావడంతో సినిమా మరింత ఆలస్యమవుతూ వచ్చింది. ఇన్నేళ్ల పాటు సినిమా సెట్స్‌పైనే ఉండటంతో నిర్మాత ఏఎం రత్నంపై ఆర్థికంగా అదనపు భారం పడింది. ఈ విషయాలను తెలుసుకున్న పవన్‌కల్యాణ్ తాను అడ్వాన్స్‌గా తీసుకున్న పారితోషికం మొత్తాన్ని తిరిగి ఇచ్చేశారు.

## పేదల పాలిట వరమైన ఆర్డీటీ సేవలు ఆగవు..

**అమరావతి:** పేదల పాలిట వరమైన ఆర్డీటీ సేవలు ఆగవని, కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నామని ఏపీ విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన అమరావతి లో మీడియాతో మాట్లాడుతూ.. రాయలసీమతో పాటు తెలంగాణ లోని పలు ప్రాంతాల్లో గ్రామీణులకు సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతోనూ, సంబంధిత ఉన్నతాధికారులతోనూ, సంస్థలతోనూ సంప్రదింపులు జరుపుతున్నామన్నారు.

**తెలుగు రాష్ట్రాల్లో 3,500 గ్రామాల్లో ఆర్డీటీ సేవలు.**

విద్య, వైద్య, విజ్ఞాన, ఉపాధి వికాస రంగాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని మంత్రి లోటకేష్ తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలతోపాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాల్లో ఈ సంస్థ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 3,500 గ్రామాల్లో ఆర్డీటీ సేవలు అమలవుతున్నాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలోని బత్తులపల్లి, అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో 600కుపైగా పడకలతో మూడు ఆసుపత్రులను ఆర్డీటీ నిర్వహిస్తోందన్నారు. ఏటా 8.5 లక్షల మంది అవుట్‌పేషెంట్లు, 60 వేలకుపైగా ఇన్‌పేషెంట్లకు సేవలు అందున్నాయన్నారు.

## బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్

-మొదటిపేజీ తరువాయి

విద్యార్థులు, రైతులు, ఉద్యమకారులను పొట్టనపెట్టుకున్నారు. పేదలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20లక్షల కోట్లు ఉంటే రూ.2వేల కోట్లతో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయలేదు. పదేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. యాదగిరిగుట్ట వద్ద అపచారానికి మూల్యం చెల్లించుకున్నారు. పాపాలు చేసినందునే మీ పరిస్థితి ఆ విధంగా మారింది. తమ పార్టీలో దెయ్యాలుచేరాయని ఆ పార్టీ నాయకురాలే చెప్పారు. జవాబివ్వలేక దెయ్యాల నేత ఫాంహౌస్‌లో నిద్రపోతున్నారు. బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్.. దెయ్యాల రాజ్యసమితి. కొరివి దెయ్యాలను తరిమికొట్టే బాధ్యత నేను తీసుకుంటా. అందుకు కార్యకర్తల సహకారం కావాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు. సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. బీఆర్ఎస్‌పై మరోసారి ధ్వజమెత్తారు సీఎం రేవంత్‌రెడ్డి,. బీఆర్ఎస్ అంటే దయ్యాల రాష్ట్ర సమితి అంటూ విమర్శించారు. తమ పార్టీ బీఆర్ఎస్‌లో దెయ్యాలు చేరినయి అని సొంతింటి బిడ్డనే అంటోందని సీఎం రేవంత్ ఇక్కడ ఉదహరించారు.

# బక్రీద్ పర్వదినం వేళ పటిష్ట భద్రతా చర్యలు

- అవాంఛనీయ ఘటనలకు తావుండకూడదు
- జిల్లా ఎస్పీ పి.జగదీష్
- జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు చేపట్టండి
- శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోండి
- జిల్లాలోని ముస్లిం సోదర సోదరీ మణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ జగదీష్

**అంకుశం క్రైమ్ ప్రతినిధి అనంతపురం జూన్ 6 :** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీస్ అధికారులకు ఆదేశించారు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావుండకూడదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సున్నిత ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బీట్లు, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. అంతేకాకుండా... అన్ని మతాల వారితో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకరి మనోభావాలు మరొకరు గౌరవించేలా మరియు పండుగ సందర్భంగా ఎలాంటి అపోహలకు తావివ్వొద్దని సూచిస్తూ ప్రజలకు తమ స్థాయిలో అవగాహన కల్పించేలా పీస్ కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేయాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో సహా ఏదైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ఏవైనా అభ్యంతరకరమైన పోస్ట్ షేర్ చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సామాజిక మాధ్యమాల గ్రూపులలో వచ్చే సందేశాలు, దృశ్యాలపై ప్రత్యేక నిఘా ఉంచామని... సైబర్ విభాగం పోలీసులు 24ఐ7 ఆయా గ్రూపులను పర్యవేక్షిస్తూ ఉంటారన్నారు. పండుగ సందర్భంగా ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సులభతరం చేయాలన్నారు. జంతు వధశాలల వద్ద నీటి సమస్య & పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ముస్లిం సోదర సోదరీ మణులకు




బక్రీద్ శుభాకాంక్షలు త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను శాంతి సామరస్యాలు వెల్లివిరిసేలా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లా ఎస్పీ పి.జగదీష్ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ పనులు వేగంగా చేయాలి

- త్వరితగతిన ఏర్పాట్లు చేపట్టాలి
- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,





**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 06 :** రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం కోసం రాత్రి పగలు పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు చేయనున్న అనంతపురం నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ లో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖపట్నం నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 9వతేదీన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను ప్రారంభించనుండగా, జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ లో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభోత్సవం కోసం అన్ని రకాల పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. గార్డెన్ డిజైన్ నాణ్యతగా చేయాలని, అందులో డ్రిప్ ఇరిగేషన్ పెట్టాలన్నారు. అడ్మిన్ బిల్డింగ్ లో గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం చకచకా పెయింటింగ్, కలర్ కోడింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. భవనం లోపల మధ్యలో ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలని, చూసేందుకు మంచిగా కనిపించాలన్నారు. భవనంలో అవసరం లేని మెటీరియల్ ని తొలగించాలని, ప్లంబింగ్ చేయాలని, టాయ్ లెట్స్ లోపల కూడా పెయింటింగ్ పూర్తి అవ్వాలన్నారు. ప్రతి గదికి అదనపు లైట్స్ ఏర్పాటు చేసి రాత్రిపూట కూడా పని చేయించాలన్నారు. చిన్నచిన్న ఫర్నిచర్ మరమ్మతులు చేయించాలని, అనవసరమైన ఖర్చు చేయరాదని, ఉపయోగపడే వస్తువులను ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్, క్లీనింగ్ పూర్తిచేయాలని, గ్రౌండ్ ఫ్లోర్ బయట కూడా పెయింటింగ్ చేయించాలన్నారు. అవసరమైన ఏఈలను నియమించి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్.అండ్.బి ఎస్ఈ వి.రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, ఆర్.అండ్.బి డిఈలు బాల కాటమయ్య, పద్మనాభ రెడ్డి, ఏఈలు కోటేశ్వర్ రెడ్డి, వై.కావ్య, ఎం.కావ్య, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# చింతకుంట మధు పై దాడి అప్రజాస్వామికం

- పిర్యాదు తీసుకునేందుకు ఎస్ఐ భయపడితే ఎలా
- నగర మేయర్ మహమ్మద్ వసీంలిఅనంత చంద్రారెడ్డి





**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 6:** జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి చింతకుంట మధు పై టీడీపీ నేతలు దాడి చేయడం అప్రజాస్వామికమని నగర మేయర్ మహమ్మద్ వసీం అనంత చంద్రారెడ్డి ఖండించారు. నగరంలోని 39వ డివిజన్ పరిధిలో వైసీపీ అధికార ప్రతినిధి చింతకుంట మధుపై శుక్రవారం టీడీపీ నేతలు దాడి చేశారు. విషయం తెలుసుకున్న మేయర్ మహమ్మద్ వసీం,వైసీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, బాధితులు చింతకుంట మధుతోపాటు వైసీపీ నేతలతో కలసి వెళ్లి 4వ పోలీసు స్టేషన్ లో దాడి ఘటనపై పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మహమ్మద్ వసీం అనంత చంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని 39వ డివిజన్ పరిధిలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో తనతో పాటు స్థానిక కార్పొరేటర్ కుమారుడైన చింతకుంట మధు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారన్నారు.అయితే కార్యక్రమం.పూర్తి అయిన తర్వాత స్థానిక టీడీపీ నేతలు టీడీపీ పాలనలో వైసీపీ కార్పొరేటర్లు ఎలా అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటారని సచివాలయ సిబ్బందిని దూషిస్తూ కార్పొరేటర్ కుమారుడైన చింతకుంట మధుపై మూకుమ్మడిగా దాడి చేయడం కూటమి పాలనలో అరాచకాలకు నిదర్శనం అన్నారు. దాడి ఘటన తర్వాత 4వ పోలీస్ స్టేషన్ సిఐ కి ఫోన్ చేస్తే తాను లీవ్ లో ఉన్నాను ఎస్ఐ ను కలవమన్నారని,ఎస్ఐకు ఫోన్ చేస్తే స్టేషన్ కు రమన్నారని తాము వెళ్తే భోజనం చేస్తున్నారన్నారు. 50నిమిషాలు గడిచినా ఎస్ఐ భోజనం చేస్తునే ఉన్నారని పిర్యాదు తీసుకునేందుకు భయపడే ఎస్ఐ ఇక ఉద్యోగం ఎందుకు చేయాలని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరం ప్రశాంతంగా ఉండేదని,అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఏనాడు కబ్జాలు, దౌర్జన్యాలను ప్రోత్సహించలేదన్నారు. నేడు కూటమి పాలనలో నగరంలో అరచకాలు అధికమయ్యాయని గత మూడు రోజులుగా ప్రధాన పత్రికలలో వస్తున్న వార్తలే ఇందుకు నిదర్శనం అన్నారు .ఇటీవల తన ఛాంబర్ లోకి సైతం టీడీపీ నేతలు దౌర్జన్యంగా ప్రవేశిస్తే ఎస్పీ కి పిర్యాదు చేసినా పట్టించుకోలేదని, నాడు ఎస్పీ కఠినంగా వ్యవహరించి ఉంటే నేడు ఇలాంటి ఘటనలు జరిగి ఉండేవి కాదాన్నారు. చింతకుంట మధు పై దాడి చేసిన భాద్యులపై చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బాధితుడు చింతకుంట మధు మాట్లాడుతూ తన డివిజన్ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమంలో మేయర్ వసీం పాల్గొని వెళ్లిన తర్వాత స్థానిక టీడీపీ నేతలు మోహన్ కుమార్,అఖిల్,ఏ ఆర్ కానిస్టేబుల్ నరేంద్ర లతో పాటు 10 మంది వచ్చి మా ప్రభుత్వంలో మీరు ఎలా కార్యక్రమాలు చేస్తారని మూకుమ్మడిగా దాడి చేశారన్నారు.భాద్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు పిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర మాట్లాడుతూ నగరంలో గతంలో ఎందరో ఎమ్మెల్యేలుగా పనిచేసారని,ఏ ఎమ్మెల్యే కూడా ప్రస్తుత ఎమ్మెల్యే లాగా దాడులు,దౌర్జన్యాలను ప్రోత్సహించలేదన్నారు.అధికారిక కార్యక్రమంలో మేయర్ తోపాటు తన తల్లి అనారోగ్యం వల్ల ఆమె కుమారుడు పాల్గొంటే టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారన్నారు.కమిషనర్ సైతం కార్పొరేటర్లను పక్కన పెట్టి టీడీపీ నేతలతో అధికారిక కార్యక్రమాలు చేయించాలని చెపుతుండటం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలను ప్రజల పక్షాన వైసీపీ తరపున పోరాడుతామని హెచ్చరించారు.కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు,వైసీపీ నేతలు పాల్గొన్నారు.

# నాట్య శిక్షణ మన భారతీయ సంస్కృతి

నియోజకవర్గ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు.



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 6:** నాట్య శిక్షణలు భారతీయ సంస్కృతికి పునాదులు అని నియోజకవర్గ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో పట్టణానికి చెందిన శ్రీ లలిత నాట్య కళానికేతన్ వారి ఆధ్వర్యంలో డాన్స్ మాస్టర్ బాబు బాలాజీ అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ వేడుకలు, 45 రోజులు వేసవి నాట్య శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి నియోజకవర్గ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు తో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ అడ హాక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీష్, ఆనందు, కోనేరు స్వామి ముఖ్యఅతిథిగా హాజరు కావడం జరిగింది. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రాచీన భరతనాట్య కళా ప్రావిణ్యం గురించి అవగాహన పొందుతూ విద్యార్థుల ప్రదర్శనలను ఇవ్వట అనేది గర్వించదగ్గ విషయమని వారు తెలిపారు. చదువుతోపాటు భారతీయ కళలను కూడా నేటి తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పాలని తెలిపారు. ఈ కార్యక్రమం నాటే గురువులు బాబు బాలాజీ కమలా బాలాజీ రామ లాలిత్య శిశు బృందం 55 మంది విద్యార్థులు కేవలం 45 రోజులలో నేర్చుకున్న కూచిపూడి భరతనాట్య జానపద నాట్యాలను ప్రదర్శించి అందరి మన్ననను పొందడం జరగడం నిజంగా సంతోషించదగ్గ విషయమని వారు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ మెడల్స్ జ్ఞాపికలను అందజేశారు.

# కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఘన స్వాగతం పలికారు



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, జూన్ 5:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు నిర్మల సీతారామన్ జిల్లాలో రెండు రోజులు పర్యటనల భాగంగా గురువారం సాయంత్రం సమయంలో బెంగళూరు విమానాశ్రయం నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి పాలసముద్రంలోని నాసిన్ అతిథిగృహామునకు కేంద్రమంత్రి చేరుకున్నారు. స్వాగతం పలికిన వారిలో జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, ఎస్పీ వి. రత్న పాల్గొన్నారు. శుక్రవారం రోజు కేంద్ర మంత్రివర్యులు నాసిన్ కేంద్రంలో పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. కేంద్ర ఆర్థిక మంత్రి తో పాటు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవులు గారు పాల్గొంటారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవితమ్మ, ఎంపీ పార్థసారధి, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొంటారు.

# నిర్మలా సీతారామన్ కి ఘన స్వాగతం పలికిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్





**అంకుశం న్యూస్ పుట్టపర్తి జూన్ 6:** శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం వద్దనున్న నాసిన్ కేంద్రంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు నిర్మలా సీతారామన్ గారిని శుక్రవారం ఉదయం రాష్ట్ర ఆర్థిక %ు% ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మర్యాదపూర్వకంగా కలిసి నంది విగ్రహాన్ని, పుష్పగుచ్ఛంను అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రివర్యులు శ్రీమతి ఎస్.సవిత , హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథిపాల్గొన్నారు.

# ఇండియన్ మ్యారీ టైం యూనివర్సిటీ లో ర్యాంకు సాధించిన అనపర్తి విద్యార్థిని



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 06:** ఇండియన్ మేరీ టైం యూనివర్సిటీ వారు నిర్వహించిన అడ్మిషన్ యూజీ టెక్నికల్ కోర్సెస్ (బిటెక్ ,బిఎస్ బిఎన్ఎస్ ప్రోగ్రాం 2025) కు అనపర్తి జిబిఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని పందిరి హంసిక ఆల్ ఇండియా ర్యాంకు 8048 సాధించినది ఈమె జిబిఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి ఆర్ ఎల్ స్వామి మరియు జి బి ఆర్ లెర్నింగ్ ట్రీ ప్రిన్సిపల్ పివి భారతీల కుమార్తె యూనివర్సిటీలో మంచి ర్యాంకు తో క్వాలిఫై అయినందుకు కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి కొండబాబు, డైరెక్టర్లు బి రత్నారెడ్డి, డివిఆర్ఏ పాపిరెడ్డి, కె. హరినాథ రెడ్డి, జి. జగన్నాథరెడ్డి, డిగ్రీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ పీ అబ్బాయి రెడ్డి అభినందనలు తెలియజేసినారు

# వికసిత్ కృషి సంకల్ప అభియాన్ అవగాహన సదస్సు లో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 06:** రంగంపేట ఎంపీడీఓ కార్యాలయంలో కృషి విజ్ఞాన కేంద్రం - కలవచర్ల వారి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ అవగాహన సదస్సు లో పాల్గొన్న అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు, రంగంపేట మండల, రంగంపేట గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిటాల బ్రాండ్ శాశ్వతంగా ఉండేలా చేస్తాం

- మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత
- కక్కలపల్లి టమోటా మార్కెట్ లో అట్టహాసంగా ప్రమాణస్వీకారోత్సవం
- రాప్తాడు నుంచి భారీ ఊరేగింపుతో ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ కు ఘన స్వాగతం
- త్వరలోనే రాప్తాడుకు వ్యవసాయ మార్కెట్ యార్డు తీసుకొస్తాం.. పరిటాల సునీత
- రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలన్న పరిటాల శ్రీరామ్




**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 6:** రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధిలో పరిటాల అనే బ్రాండ్ శాశ్వతంగా ఉండేలా పని చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తో పాటు ఇతర కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి కే పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ కు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలలు వేసి తమ అభిమానం చాటుకున్నారు. అనంతరం అక్కడి నుంచి భారీ ఊరేగింపుగా కక్కలపల్లి టమోటా మార్కెట్ వరకు వచ్చారు. అనంతరం ప్రమాణస్వీకారోత్సవం పండుగ వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి వేలాదిమంది కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ నూతన మార్కెట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గంలో విస్తృతంగా పంట సాగు ఉందని.. అయితే ఎంత ఖర్చు పెట్టి పంటలు సాగు చేసినా సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతుంటారన్నారు. ఇలాంటి సమయంలో మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు చొరవ తీసుకుని రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. మార్కెట్ యార్డ్ కార్యాలయంలో కూర్చుని ఉండకుండా నిరంతరం హార్టీకల్చర్, వ్యవసాయశాఖ అధికారులను సమన్వయం చేసుకుని గ్రామాల్లో పర్యటించాలన్నారు. ఏప్రాంతంలో ఎక్కువగా ఏ పంట సాగు చేస్తున్నారో అక్కడ దిగుబడులు ఇతర ప్రాంతాలకు ఎలా తరలించాలన్నది సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ముందు జగన్ని గద్దె దించేందుకు ఏ విధంగా పోరాటం చేశారో.. ఇప్పుడు రైతుల కోసం అదే తరహాలోనే పని చేయాలన్నారు. గతంలో ఉన్న వారు సరిగా పని చేయలేదు కాబట్టే మీకు ఇప్పుడు అవకాశం వచ్చిందన్నారు. మీకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం ఎప్పటికీ ఉంటుందని.. రైతుల కోసం పని చేయాలని శ్రీరాం సూచించారు. మరోవైపు పరిటాల సునీత మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఇప్పుడు మార్కెట్ యార్డ్ కమిటీలో స్థానం దక్కిన ప్రతి ఒక్కరూ ఆ పదవులకు వన్నె తెచ్చే విధంగా పని చేయాలన్నారు. గతంలో ఎక్కువ మంది పోటీ ఉండటం వలన చివరి వరకు కమిటీ ఏర్పాటు కాలేదని.. చివర్లో పదవులు ఇచ్చినా.. సమయం తక్కువగా ఉండటం వలన సరిగా పని చేయలేకపోయారన్నారు. ఇప్పుడు మీకు నాలుగేళ్ల సమయం ఉంటుందని.. కచ్చితంగా రైతులకు ఉపయోగపడే విధంగా పని చేయాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో విస్తృతంగా పంటలు సాగు ఉన్న నేపథ్యంలో ప్రత్యేకంగా మార్కెట్ యార్డ్ అవసరం అన్నారు. గొందిరెడ్డిపల్లి దగ్గర 30ఎకరాల స్థలం ఉందని.. ఇప్పటికే కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు. కచ్చితంగా త్వరలోనే మార్కెట్ యార్డు వస్తుందని..అప్పటి వరకు రాప్తాడులో కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులంతా నిరంతరం రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించాలని.. వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చూడాలన్నారు. ఒక రైతుకు ఒక పంటలో బాగా లాభం వస్తే.. మిగిలిన వారు కూడా ఒకే సమయంలో ఒకే రకమైన



పంటలు వేయడం వలన గిట్టుబాటు ధరలు ఉండటం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించి.. రైతులకు ఏం కావాలన్నది తమ దృష్టికి తీసుకొస్తే.. కచ్చితంగా వాటిని ఎంపీ సాయంతో ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. గతంలో ఫ్యాక్షన్ ప్రాంతంగా ఉన్న రాప్తాడుకు ఓ వైపు హంద్రీనీవా, మరోవైపు పీఏబీఆర్ నీరు తీసుకొచ్చి రైతులు పంటలు పండించుకునే విధంగా చేశామన్నారు. ఇప్పుడు రాప్తాడు వ్యవసాయంలో అగ్రగామిగా ఉందని రానున్న రోజుల్లో ఇంకా అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని.. పరిటాల అనే బ్రాండ్ గుర్తుండేలా పనులు ఉంటాయని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు. మరోవైపు ప్రమాణస్వీకారం అనంతరం ఛైర్మన్ సుధాకర్ చౌదరి, ఇతర కమిటీ సభ్యులు మాట్లాడుతూ పరిటాల కుటుంబాన్ని తమ జీవితంలో మర్చిపోమని... రైతుల కోసం శక్తివంచన లేకుండా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామన్నారు...

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి,దాతలచేప్రారంభోత్సవాలు చేయించిన ఎమ్మెల్యే నల్లమిల్లి




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 06:** అనపర్తి కొత్తూరు కమ్యూనిటీ హాల్ లో రూ.9,30,000/- రూపాయలతో నిర్మించిన వంటశాలను, ప్రముఖ నేత్ర వైద్యులు తేతల సత్యనారాయణరెడ్డి మస్తానమ్మ దంపతుల విరాళం రూ. 95,500/- రూపాయలతో వంటశాల పైకప్పు నిర్మాణం చేసిన వంటశాలను ప్రారంభించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. రూ.2,00,000/- రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభోత్సవంలో తో పాటు రూ.21,00,000/- రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకస్థాపన చేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు తమలంపూడి సుధాకర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకన్న బాబు, ప్రముఖ వ్యాపారవేత్త శివారెడ్డి, గ్రామ సర్పంచ్ వారాకుమారి, అనపర్తి మండల, అనపర్తి, కొత్తూరు గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనపర్తి, బిక్కవోలు మండలాల్లో పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సత్తి




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 06:** అనపర్తి మండలం అనపర్తి కొత్తూరు గ్రామానికి చెందిన సత్తి వీర వెంకట సత్యనారాయణరెడ్డి కాలు ఫ్రాక్చర్ అయింది. వారిని వారి కుటుంబ సభ్యులను,బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామానికి చెందిన పుట్టు చిన్న వీర్రాజు కాలుకి సెప్టిక్ అవ్వడం వల్ల చికిత్స చేయించుకుంటున్నారు. వారిని వారి కుటుంబ సభ్యులను, ఇదే గ్రామానికి చెందిన విజ్జిన శ్రీను కుమార్తె బుంగ సౌజన్య ఇటీవల అనపర్తి ప్రభుత్వాసుపత్రిలో మగ బిడ్డను ప్రసవించడం జరిగింది. తల్లిని బిడ్డను చూసి క్షేమ సమాచారాలు తెలుసుకున్న అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త , మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి. వారితో పాటు చింతా స్వామి చంద్రారెడ్డి, బొడ్డుముత్యాలరావు(రాష్ట్ర బూత్ కమిటీ విభాగం సెక్రటరీ) పోతుల ప్రసాద్ రెడ్డి (బుజ్జి గారు) (బిక్కవోలు మండల కన్వీనర్)తదితరులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైయస్ఆర్‌సీపీ) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుమలలో నిండిపోయిన కంపార్ట్మెంట్లు



తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. టోకెన్లు లేనివారికి శ్రీవారి సర్వ దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. మరోవైపు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్మెంట్లు నిండిపోయి వెలుపల క్యూ లైన్లో భక్తులు వేచి ఉన్నారు. నిన్న శ్రీవారిని 67,284 మంది భక్తులు దర్శించుకోగా 31,268 మంది తలనీలాలు సమర్పించారు. హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు వచ్చినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

# పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న ఎంపీఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి

### పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 06:** పర్యావరవరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యపడుతుందని మండపేట ఎంపీఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి చిన్నారావు అన్నారు. మండపేట మండలం మారేడుబాక సచివాలయ ఆవరణలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సందర్భంగా ప్రధాని మోడీ ఆదేశాలు మేరకు పంచాయతీ, మావుళ్ళమ్మ తోట ఆవరణంలో చిన్నారావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం కారణంగా జరిగే నష్టం అప్పటికప్పుడు ఎవ్వరికి కనిపించదన్నారు. నష్టం ఏమిటో అర్థం కాకపోవడంతోనే పలువురు పర్యావరణ పరిరక్షణ బాధ్యత గుర్తించలేకపోతున్నారన్నారు. భూమి సహజ వనరులను కాపాడుకోలేకపోతే భవిష్యత్ తరాలు దారుణంగా నష్టపోతాయన్నారు. ఇటీవల చెన్నై వంటి నగరం నీళ్లు లేక అల్లాడిపోయింది అంటే అందుకు మానవ తప్పిదాలే కారణమన్నారు. ప్లాస్టిక్ కారణంగా భవిష్యత్ లో చెట్లు మనుగడ సాధ్యం కాదన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. ఇప్పుడు మనం తీసుకునే జాగ్రత్తలు భవిష్యత్ తరాలకు పూల బాటలు వేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పసలపూడి శ్రీనివాసరావు ,పాలిక రమణ బిజెపిమండల అధ్యక్షుడు సోడసాని మురళి, వల్లు పాండు రంగ, సర్పంచ్ మట్టపర్తి గోవింద రాజు, వీఆర్వో రాముడు, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది ఏఎన్ఎంలు పాల్గొన్నారు.




## రైతులకు ఉపయోగపడే పనులు చేయండి.. ఎంపీ పార్థసారథి




**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 6:** రాప్తాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న హిందూపురం ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ నూతన మార్కెట్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కమిటీకి కొన్ని సూచనలు చేశారు. ఈ ప్రాంతంలో వ్యవసాయం ఎక్కువగా ఉందని ఇక్కడ మార్కెట్ ఆదాయాన్ని పెంచుకునే వనరులు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇలాంటి సమయంలో కమిటీ సభ్యులు దీనిపై దృష్టి సారించి మార్కెట్ వచ్చిన తర్వాత దానిని అభివృద్ధి చేసే విధంగా చూడాలన్నారు. తద్వారా వచ్చిన డబ్బును రైతులకు ఉపయోగించాలని సూచించారు. గత ఐదేళ్లలో రాక్షస పాలన సాగిందన్నారు. ఎక్కడ ప్రజలకు ఉపయోగపడే పని చేయకుండా దాడులు అరెస్టులతో రెచ్చిపోయారన్నారు. అందుకే వారిని ప్రజలు పక్కన పెట్టారన్నారు. వారు చేసిన పని వల్ల రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని.. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుని త్వరలోనే పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు మీరు తీసుకొస్తారన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు కూడా ఎక్కువగా వస్తున్నాయని మన పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

## త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనం

### ముస్లిం సోదరులకు ఎంపీ కేశినేని శివనాథ్ బక్రీద్ శుభాకాంక్షలు



**అంకుశం ప్రతినిధి విజయవాడ జూన్ 6:** విజయవాడ: త్యాగం, సహనం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు ప్రతీక బక్రీద్. ముస్లిమ్స్ జరుపుకునే పవిత్ర పండుగ బక్రీద్. పవిత్రమైన బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర సోదరీమణులకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. “మనిషి దైవానికి ప్రీతిపాత్రుడు కావాలన్నా, తోటి మానవుల హృదయాల్లో కొలువు తీరాలన్నా త్యాగమే ఉత్తమ మార్గమని ప్రవక్త ఇబ్రహీం జీవితం చెబుతుంది. త్యాగం, సహనం, దానం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలు.. . ప్రవక్తల అచంచలమైన దైవభక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుంది. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుంది. తమకున్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని చాటిచెప్పుంది. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ ఆయన మార్గంలో నడిచి అల్లా ఆశీస్సులు అందుకోవాలి. ప్రజలందర్నీ అల్లా సుఖశాంతులతో చూడాలి” అని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

## హాకీ సత్యసాయి జిల్లా తొలి విజయం!



**అంకుశం న్యూస్ ధర్మవరం: జూన్ 6 :** హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో భీమవరంలో జరుగుతున్న 15వ రాష్ట్ర స్థాయి మహిళ హాకీ టోర్నమెంట్లో సత్య సాయి జిల్లా జట్టు తన మొదటి లీగ్ మ్యాచ్లో నంద్యాల జిల్లా జట్టుపై 16 -0గోల్స్ తేడాతో గెలుపొందింది. జిల్లా జట్టు తన తదుపరి లీగ్ మ్యాచ్ లు నెల్లూరు జిల్లా, తిరుపతి జిల్లాలతో తలపడుతున్నది, భీమవరం నుండి మేనేజర్, అరవింద్ గౌడ్, కోచ్ మారుతి కుమార్ విలేకరులకు ఈ విషయాన్ని తెలియజేశారు. గెలుపొందిన జిల్లా జట్టును హాకీ సత్యసాయిజిల్లా జనరల్ సెక్రెటరీ సూర్యప్రకాష్, మరియు జిల్లా కార్యవర్గం అభినందనలు తెలియజేశారు.

## యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

### : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 06 :** ఈనెల 8వ తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. శుక్రవారం అనంతపురం నగర శివారులో ఉన్న శిల్పారామంలో ఈనెల 8వ తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా రాష్ట్ర షెడ్యూల్ మేరకు ఈనెల 8వ తేదీన సోమవారం ఉదయం నిర్వహించే జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఆయుష్ శాఖ, స్పోర్ట్ అథారిటీ, టూరిజం శాఖ, మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్డీవో, తదితర అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కోసం అవగాహన కల్పించాలన్నారు. శిల్పారామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, బాగా తయారు చేయాలని, పెయింటింగ్ వేయాలని, మొక్కలు నాటి పచ్చదనం పెంచాలన్నారు. పర్యాటక ప్రాంతమైన శిల్పారామంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ చంద్రశేఖర్, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, తహసీల్దార్ హరికుమార్, ఆయుష్ అధికారులు డా.భాస్కర్, డా.లాల్యా నాయక్, యోగా గురువు కృష్ణవేణి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

